ప్రజాశక్తి

సోమవారం 9 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బాల్యం.. బడికి దూరం..

- పెరుగుతున్న బాలకార్మికులు
- ఆధార్‌లో వయస్సు మార్పు చేసి పనుల అప్పగింత
- భిక్షాటనలో కనిపిస్తున్న వందలాది మంది బాలలు
- శాపంగా మారిన పాఠశాల విద్యా వ్యవస్థలో మార్పులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బాల కార్మికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దుకాణాల్లో పనిచేస్తున్న పలువురు బాల కార్మికులను సిఐడి, కార్మిక శాఖ అధికారులు అడపాదడపా గుర్తించి పట్టుకుంటున్నారు. వీరిని పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా ఇటీవల కాలంలో పాఠశాల విద్యలో వచ్చిన మార్పులు, నూతన విద్యావిధానం అమలు, పాఠశాల విలీనం పేరుతో కుదింపు తదితర కారణాల వల్ల వేలాది మంది చదువునుంచి అర్ధాంతరంగా తప్పుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు దూరం కావడం, కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు తొలగించడం, పలు ఎయిడెడ్ పాఠశాలలు అన్ ఎయిడెడ్‌గా మారి ఫీజులు వసూలు చేయడం వంటి కారణాలతో విద్యార్థులుగా ఉండాల్సిన బాలలు ఇతర మార్గాలవైపు మళ్లుతున్నారు. పాఠశాలలకు దూరమైన వారిని వెనక్కి తీసుకువచ్చి తిరిగి పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

గుంటూరులోని వేర్వేరు ప్రాంతాల్లో 14 ఏళ్లలోపు పిల్లలు ఇతర పనులకు వెళ్తున్నారు. కొంతమంది బిక్షాటన చేస్తున్నారు. గుంటూరులో గోవుల కేంద్రాలను నిర్వహిస్తున్న కొంత మంది ప్రజల్లోఉన్న సెంటిమెంట్స్‌ను ఆసరాగా తీసుకుని బాల బాలికలకు గోవులు ఇళ్ల వెంబడి పంపించి యాచిస్తున్నారు. కొంతమందికి ఆవుతో ఉన్న సెంటిమెంట్‌ను ఆవులపెంపకం నిర్వహణా కేంద్రాల వారు సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం గుంటూరులోని అనేక ప్రాంతాల్లో ఆవులతో అడుకుంటున్న బాలలు అనేక మంది కన్పిస్తున్నారు. ఆర్‌టిసి బస్సులు, థియేటర్ల వద్ద తినుబండారాలు విక్రయిస్తూ అనేక మంది బాలలు కన్పిస్తున్నారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా పలువురు యజమానులు పనుల్లో చేర్చుకుంటున్నారు. అయితే ఆధార్ కార్డులో 15 ఏళ్లకు పైగా ఉన్నట్టు నమోదు చేయించుకురావాలని సూచిస్తున్నారు. ఆధార్ కార్డులో 15 ఏళ్ల దాటి ఉన్నట్టు ఉంటే చేర్చుకుని వీరు బాలకార్మికులు కాదని వ్యాపారులు అధికారులను బురిడి కొట్టిస్తున్నారు. గుంటూరులో వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న 9 మంది బాల కార్మికులను ఇటీవల సిఐడి ఎస్‌పి కె.వి.జి.సరిత ఆధ్వర్యంలో గుర్తించి వారిని బాలలసదన్‌కు పంపారు. వీరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి చదివించాలని సూచించారు. ఆపరేషన్ స్వేచ్ఛ-3లో భాగంగా బచ్పన్ బచావో ఆందోళన క్రాప్ ఆర్గనైజేషన్‌లు కలిసి గుంటూరులో మెకానిక్ షాప్స్, వాటర్ ప్లాంట్స్, చికెన్ సెంటర్‌లో బాల కార్మికుల డ్రైవ్ నిర్వహించి 9 మంది బాల కార్మికులను గుర్తించారు. వారిని రిస్క్యూ జిల్లా బాలకార్మిక విభాగం ఎదుట హాజరుపరిచారు. ఇంకా చాలామంది చదువుకు దూరంగా వేర్వేరు మార్గాల్లో జీవనం సాగిస్తున్నారు.

పాదయాత్రలో మాట్లాడుతున్న ఎం.రవి

గుర్తింపు లేని కౌల్దార్లు

- కార్డుల జారీలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- పనుల్లేక భవన నిర్మాణ కార్మికులకు ఇక్కట్లు
- నష్టాల పాలైన గులాబీ పూల సాగుదార్లు
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- దుగ్గిరాల మండలంలో కొనసాగిన ప్రజాచైతన్య పాదయాత్ర

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయం చేస్తోంది కౌల్దార్లే అయినా వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులను సరిగా మంజూరు చేయలేదని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం మండలంలోని పెదపాలెం నుండి ప్రారంభమైన యాత్ర పేరుకులపూడి, చుక్కపల్లివారిపాలెం, తాడిబోయినవారిపాలెం, నల్లమేకలవారిపాలెం, ఈమని, దుగ్గిరాల, మంచికలపూడి గ్రామాల్లో సాగింది. పాదయాత్ర బృందం ఆయా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పొలాలు, జగనన్న కాలనీలు, డ్రెయినేజీ దుస్థితి, నిరుపయోగంగా ఉన్న వ్యర్థాల నిర్వహణ కేంద్రం తదితరాలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 75 శాతం మంది కౌలురైతులే అయినా వారికి గుర్తింపు కార్డులు దక్కలేదన్నారు. కౌలుదారు చట్టాని మార్చిన వైసిపి ప్రభుత్వం భూ యజమాని సంతకాన్ని తప్పనిసరి చేయడంతో అందుకు యజమానులెవరూ ముందుకు రావడం లేదని అన్నారు. వ్యవసాయంలో కీలకమైన కౌల్దార్లకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కోరారు. చుక్కపల్లివారిపాలెంలో జగనన్న కాలనీలో కేటాయించిన ప్లాట్లలో సగం మంది కూడా ఇళు నిర్మించుకోలేకపోయారని, ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏ మాత్రమూ సరిపోదని, కనీసం రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ఈమని గ్రామంలో గులాబీ తోటలను పరిశీలించి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి

2లో

గులాబీ తోటను పరిశీలిస్తున్న నాయకులు

డ్రెయినేజీ సమస్యను పరిశీలిస్తున్న పాదయాత్ర బృందం

పట్టుకుంటే ఏడాదికి రూ.2-3 లక్షల ఆదాయం

- రైతులతోపాటు యువకులకూ ఉపాధి
- ప్రజాశక్తితో పట్టు పరిశ్రమ శాఖ పల్నాడు జిల్లా అధికారి పి.రాధారాణి

8లో

జిజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తితో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

8 లో

పేకాట స్థావరాలపై దాడులు

3 లో

క్షతగాత్రుల వద్ద గంజాయి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రోడ్డు ప్రమాదానికి గురైన వారి వద్ద గంజాయిని పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రి కూడలి జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం అదుపుతప్పి దంపతులు కింద పడిపోయారు. గమనించిన స్థానికులు వారిని పక్కనే ఉన్న ఎన్నారై ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుల వివరాల కోసం వారి బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయి దొరికింది. క్షతగాత్రులు చెన్నయ్ ప్రాంతానికి చెందిన వారని, వీరు తుని నుండి నాలుగు కిలోల గంజాయిని సుమారు రూ.30 వేలకు కొనుగోలు చేసి తీసుకెళున్నారని పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు దుర్మరణం

పొలంలోని బోరుకు మరమ్మతులు చేయించే క్రమంలో ప్రమాదం

వార్త మొదటిలో

మాట్లాడుతున్న బాబురావు

'జన కథ' ద్వారా అంబేద్కర్ చరిత్రను ప్రజలకు తెలియజేయాలి

ప్రజాశక్తి-తెనాలి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను 'జన కథ' కళారూపాల్లో గ్రామ గ్రామానికీ తీసుకువెళ్లాలని వక్తలు చెప్పారు. స్థానిక అయితా నగర్ పొట్టిశ్రీరాములు కళ్యాణ మంటపంలో మేకతోటి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో 'జన కథ' సభా కార్యక్రమం ఆదివారం జరిగింది. కనపర్తి బెనహర్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కె.అబ్రహం లింకన్ మాట్లాడుతూ భారతదేశంలో సమతాభావంతో ముందుకు వెళ్లాలంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ఆయన జీవిత చరిత్ర, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన త్యాగం ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. దళిత మహాసభ నాయకులు ఎన్.బాబురావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు సమతావాదులు, మానవతావాదులు, అంబేద్కరిస్టులు అందరూ సమిష్టిగా ముందుకు కదలాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎ.నాగవేణి, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, హార్మోనియం శ్రీనివాసరావు, న్యాయవాది పి.విద్యాసాగర్, పి.శ్రీరాములు, డి.వీరయ్య, కె.శేషు, జాషువా విజ్ఞాన సమితి కన్వీనర్ జె.న్యూటన్, రంగస్థలం కళాకారుడు ఎ.వి.కోటేశ్వరరావు, డి.వెంకటేశ్వరరావు, జి.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న డాక్టర్ రాజారావు తదితరులు

బాలగోపాల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మానవ హక్కులను నిర్వచించిన మహావ్యక్తి, స్వతంత్ర ఆలోచనలతో ఎదిగి సామాజిక ఉద్యమాల స్ఫూర్తితో హక్కుల ఉద్యమాలను ఉవ్వెత్తిన ముందుకు తీసుకువెళ్లిన డాక్టర్ బాలగోపాల్ సేవలు చిరస్మరణీయమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ టి.రాజారావు అన్నారు. మానవ హక్కుల వేదిక నిర్మాత, మానవ హక్కుల కార్యకర్త కె.బాలగోపాల్ 14వ వర్ధంతి సభ పట్టణంలో మానవ హక్కుల వేదిక కార్యాలయంలో ఆదివారం జరిగింది. సభకు మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు జిఎస్ రాయల్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రాజారావు మాట్లాడుతూ డాక్టర్ బాలగోపాల్ మన మధ్యన లేకపోవడం బాధాకరమని అన్నారు. అయినా ఆయన స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మన మనమందరిపైనా ఉందన్నారు. జిఎస్ రాయల్ మాట్లాడుతూ సంస్థలు అనుబంధంగా ఉండకూడదని సొంత ఆలోచనలతో హక్కుల కోణంలో ఆలోచిస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా బాలగోపాల్ చిత్రపటానికి డాక్టర్ రాజారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కెఎన్‌పిఎస్ నాయకులు టి.శ్రీనివాస్, గుడిసె వాసుల సంఘం నాయకులు బి.వెంకటేశ్వర్లు, హక్కుల కార్యకర్తలు కె.విజయకుమార్, షేక్ సుభాని, న్యాయవాది ప్రకాష్ పాల్గొన్నారు.

గుర్తింపు లేని కౌల్దార్లు

(మొదటి పేజీ తరువాయి)

కూడా రావడం లేదని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చెత్త నుండి సంపద తయారు చేస్తామంటూ ప్రతి గ్రామంలో రూ.ఏడెనిమిది లక్షలతో నిర్మాణాలు చేపట్టినా వాటిని నిరుపయోగంగా వదిలేశారని అన్నారు.

దుగ్గిరాల, ఈమని గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నారని, అయితే సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల కారణంగా ఇళ్ల నిర్మాణం మందగించి కార్మికులకు పనులు తగ్గాయని చెప్పారు. ఒకపక్క కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతుంటే వాటి ప్రభావంతో నిత్యావసరాల ధరలూ పెరుగుతున్నాయని, మరోవైపు సామాన్యులకు ఉపాధి దొరకని విధంగా ప్రభుత్వాల విధానాలను అమలు చేస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఇదే క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. సమస్యపై ఈనెల 16వ తేదీన మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తామని ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మంచికలపూడిలో బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.రవి, మండల కార్యదర్శి జె.బాలరాజు, నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణరావు, వివికె సురేష్, ఎన్.యోగేశ్వరరావు, సిహెచ్ పోతురాజు, బి.అమ్మిరెడ్డి, జి.శ్రీనివాసరావు, సాంబశివరావు, కె.కోటయ్య, కె.రాజేంద్రబాబు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు డి.శ్రీనివాసరావు, మేరమ్మ తదితరులు గేయాలతో ఉత్సహ పరిచారు.

డంపింగ్ యార్డు పరిశీలనలో నాయకులు

మంచికలపూడి బహిరంగ సభలో ప్రజలు

రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

బీసీల చైతన్యం కోసం అన్ని జిల్లాల్లో బస్సు యాత్ర

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం కుంచనపల్లిలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి 7 అంశాలను ఎజెండాగా ప్రవేశపెట్టామన్నారు. ఇటీవల పార్లమెంట్లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లులో 33 శాతం వాటాలో ఓబీసీ మహిళలకు వాటా ఎంత అనే అంశంపై చేర్చకపోవడాన్ని వ్యతిరేకరిస్తున్నట్లు చెప్పారు. బీసీల్లో చైతన్యం కోసం బస్సు యాత్ర చేస్తామని, అన్ని జిల్లాల్లో బీసీ భవన్ల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించవలసిన పాత్రను గురించి చర్చించామన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించాలని, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.క్రాంతి కుమార్, ఎ.నాగమల్లేశ్వరరావు, కె.కమల, పి.మహేష్ పాల్గొన్నారు.

కృపమ్మ కుటుంబానికి రూ.2 లక్షల సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

పని ఒత్తిడితో మృతిచెందిన తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డుకు చెందిన ఆశ కార్యకర్త రేపూడి కృపమ్మ కుటుంబానికి ఆదివారం టిడిపి తరుపున ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. సిఐటియు, టిడిపి రెండు రోజుల పాటు పెద్దఎత్తున పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగొచ్చి రూ.10 లక్షలు ఆర్థిక సాయంతో పాటు ఇంటిస్థలం, ఇంటి నిర్మాణం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చారు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు నారా లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.2 లక్షలు తమ పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ వృత్తికి సంబంధంలేని పనులు చేయించడం వల్లే ఒత్తిడి గురై కృపమ్మ మృతి చెందారని, కృపమ్మ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సరైన శిక్షణ లేకుండా ఆశ వర్కర్లకు పనులు అప్పగించి ఒత్తిడికి గురి చేస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రజల డబ్బుతో ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. షుగర్, బిపి మందులు తప్ప వైద్య శిబిరాల్లో ఏమీ ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొర జీతాలు ఇస్తూ వారికి త్రిశంకు స్వర్గంలోకి నెట్టేశారన్నారు. ఉద్యోగుల పేరుతో ప్రభుత్వ పథకాలు అందడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఆరుద్ర భూలక్ష్మి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

అలరించిన డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో ఆర్ట్ స్థాయిని మోడ్రనైజ్ చేయాలనే ముఖ్య ఉద్దేశంతో నగరానికి చెందిన ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుపోజు జయశ్రీ ప్రభాకర్ డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ డాక్టర్:టి.విజయ మహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు... సభని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చిత్రకారులు చేస్తున్న అద్భుతాలు వర్ణణాతీతమన్నారు. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా పదికి పైగా పెయింటింగ్స్ అమ్ముడు పోవటం ద్వారా సరికొత్త రికార్డును ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ టీం లిఖించిందని అభినందించారు. డిజిటల్ పెయింటింగ్ కాంటెస్ట్‌లో చిన్నారులు చూపిన ప్రతిభ అమోఘమన్నారు. సమాజిక స్పృహతో సొసైటీకి పనికొచ్చే ఇలాంటి ఉపయోగకరమైన పనులు చేస్తున్న ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ టీం సభ్యుల కషిని ఆవిడ కొనియాడారు. అనంతరం ఆత్మీయ అతిథిగా హాజరైన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ప్రతినిధి బి.ఆర్.తులసీ రావు మాట్లాడుతూ ప్రస్తుత జనరేషన్ పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని సాంకేతికతో వారు తమ రెగ్యులర్ స్టడీస్‌కి సంబంధించిన ప్రోజెక్ట్ వర్క్స్ చేసుకోవచ్చని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన ఇన్నర్ వీల్ క్లబ్ మిడ్ టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి, జిజ్ఞాస ఇంటర్ఫేస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ భార్గవ్ ది ఇండియన్, ఎలిమెంట్ స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ డైరెక్టర్ పాలడుగు మహేష్‌లు చిన్నారులు డిజిటల్ పెయింటింగ్ నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదా నోత్సవ కార్యక్రమంలో ముందుగా సీనియర్ చిత్రకారులు అనుపోజు జయశ్రీ ప్రభాకర్‌ని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఘనంగా సత్కరించారు, అనంతరం డిజిటల్ పెయింటింగ్ కాంటెస్ట్‌కి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉప్పరాపల్లి వేణుగోపాల్, గిరిధర్ అరసవల్లి లకు ప్రత్యేక జ్ఞాపికలను అందజేసారు, అనంతరం డిజిటల్ పెయింటింగ్ కాంటెస్ట్ లో గెలుపొందిన విజేతలకు ప్రసంశా పత్రాలను జ్ఞాపికలను అతిథుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్ కుమార్ అనుమకొండ, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు పర్యవేక్షించగా కోకన్వీనర్ గిరిధర్ అరసవల్లి, కార్యక్రమ నిర్వాహకుడు స్ఫూర్తి శ్రీనివాస్, కోఆర్డినేటర్ ఎస్.పి.మల్లిక్,సుబ్బు ఆర్వీ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆమ్రపాలి, సంధ్యారాణి, సుధా రాణి, స్వాతి పూర్ణిమ, వర్కింగ్ కమిటీ మెంబెర్స్ రమేష్ అర్కాల, శ్రావణ్‌కుమార్, అనిల్ డ్యానీతో పాటు పలువురు సీనియర్ చిత్రకారులు యువ చిత్రకారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు.. జూదరులు అరెస్టు

- క్రోసూరు, ఈపూరు, నకరికల్లు, నాదెండ్ల మండలాలు, పిడుగురాళ్లలో దాడులు
- భారీ మొత్తంలో నగదు స్వాధీనం

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని హసనాబాద్ శివారు వన్నాయపాలెం మధ్యలో కొండ వద్ద పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. క్రోసూరు ఎస్ఐ పాల్ రవీందర్, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. 13 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.81,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనేక నేరాలకు మూల కారణం బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడమేనని అన్నారు. మద్యం సేవించి, పేకాట ఆడి అనేక గొడవలు జరిగి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పోలీసు అధికారులు ప్రతిరోజు నిర్మానుష్య ప్రదేశాలలో, కల్వర్టులు, నిరుపయోగంగా ఉన్న ప్రదేశాలలో, శ్మశాన వాటికల వద్ద గస్తీ తిరుగుతున్నట్లు తెలిపారు. ఆయా చోట్ల ఎవరైనా మద్యం సేవిస్తుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. నేర నియంత్రణలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని చిట్టాపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ సిబ్బందితో కలిసి ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడులలో ఆరుగురుని అదుపులోకి తీసు కొని వారి వద్ద నుండి రూ.4,960 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని కుంకలగుంట శివారు పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కుంకులగుంటలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం వరకు తన సిబ్బందితో దాడి చేసి సుమారు పదిమందిని అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుండి 1 లక్ష 48వేల760 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని జానపాడు రోడ్డు నందు గల ఓ దుకాణంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పిడుగురాళ్ల పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 16 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని,వారి

ఈపూరు మండలం చిట్టాపురంలో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు

వద్ద నుంచి రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని పట్టణ సిఐ వీరాంజనేయులు తెలిపారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరు రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ కోళ్ళ ఫారంలో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 6,150/ నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు నాదెండ్ల ఎస్ఐ తెలిపారు

దీక్షలను ప్రారంభిస్తున్న మస్తాన్‌వలి, తదితరులు

ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని ఇవ్వాలని కోరుతూ గుంటూరు కలెక్టరేట్ ఎదుట నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లక విజయ రాజు ఆదివారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈదీక్షకు మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, ప్రత్యేక హోదా రాష్ట్ర జెఎసి కన్వీనర్ ఎస్.కె.జిలానీ, బడుగు బలహీన వర్గాల జెఏసి రాష్ట్ర అధ్యక్షులు రామరాజు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ఈమని చంద్రశేఖర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షల్లో నవోదయం పార్టీ నాయకులు నల్లక భరత్, సిహెచ్. మార్కండేయులు, కవిత, ఎన్.శ్రీను, కె.ఏడుకొండలు, నాగరాజు, సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ మన పిల్లల భవిష్యత్ కోసం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని కావాలని అన్నారు. ఈదీక్షలకు అందరి అందరి మద్దతు కావాలని పిలుపునిచ్చారు.

విభజన హామీలను నెరవేర్చండి

ప్రజాశక్తి-తెనాలి

మాట్లాడుతున్న రామ్మోహనరావు

రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు పూర్తయినా అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగునే ఉండటానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరే కారణమని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మో హనరావు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని బృందావన్ హోటల్‌లో ఆదివారం లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులు శరత్‌చంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామ్మోహన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో విద్య, వైద్యం కార్పోరేట్ల కబంధ హస్తాల్లోకి పోతుందన్నారు. తెనాలి జిల్లా వైద్యశాల్లో సిటిస్కాన్ ఉండాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉద్యమం చేసిందని, ఫలితంగా సిటి స్కాన్ వచ్చినా దాని పనితీరు లోపభూయిష్టంగా ఉం దన్నారు. దీంతో ప్రైవేలు ల్యాబ్స్ ప్రజలను దోచేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఏపి అభివృద్ధికి విభజన హామీలను అమలు చేయాలని, అమరావతి రాజధానిగా కొనసాగటానికి కేంద్రం జోక్యం చేసుకుని, స్పష్టమైన హామీ నివ్వాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

అదుపు తప్పిన పెళ్లి బృందం లారీ

- 13 మందికి గాయాలు
- పేరేచర్లలోని కైలాసగిరి కొండపై ఘటన

ప్రజాశక్తి- మేడికొండూరు.

పెళ్లి బృందం ప్రయాణిస్తున్న మినీ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కొండ రాయిని ఢీకొనడంతో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పేరేచర్లలోని కైలాసగిరి కొండ వద్ద ఆదివారం జరిగింది. ఢిల్లీ రాష్ట్రానికి చెందిన కొందరు కార్మికులు వలస వచ్చి గుంటూరు మిర్చి యార్డులో కూలీలుగా పని చేస్తున్నారు. వారి కుటుంబంలో వివాహము నిమిత్తం ఆదివారం ఉదయం కైలాసగిరి కొండపైనున్న శివాలయానికి వెళ్లారు. వివాహం అనంతరం మినీలారీలో కొండపై నుంచి కిందకు దిగుతుండగాఅదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న కొండరాయిని బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఏడుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు . అంజలి, గుడ్డి దేవి మనోజ్ ,సుమిత్, జూలీ ,మీరా ,గబ్బర్, మంజేష్ ,అరుషి, గౌరవం ,హచల్, సునీత దేవి ,శ్రీనులు జరిగిన ప్రమాద సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సరఫరాపై హర్షం

ప్రజాశక్తి గుంటూరు సిటి

నగరంలోని ప్రజలకు తాగునీరు సరఫరా లో ఇటీవల కాలంలో నగర పాలక అధికారులు తీసుకున్న చర్యలపై ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రెసిడెంట్ ఓరుగంటి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్ ల ఓవర్ హెడ్ ట్యాంక్ ల క్లీనింగ్ ను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారుల సహకారంతో నేటికి 40 గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్ నుండి ఫిల్టర్ క్లోరినైటెడ్ వాటర్ ను సిటీ లోని ప్రజలకు అందేలా చేయ గలిగామన్నారు. అందుకు సహకరించిన నగర కమిషనర్ చేకూరి కీర్తికి, ఇంజనీర్ లకు నారాయణరెడ్డి అభినందనలు తెలిపారు. శాశ్వత మంచి నీటి సరఫరలోని ఈ ఎల్ ఎస్ ఆర్ ట్యాంకులైన బిఆర్ స్టేడియంలోని 2, నెహ్రు నగర్- 1, ఏటి అగ్రహారం1,స్తంభాలగరువు-1 గుజ్జనగుండ్ల -1,శారదాకాలని-1 మొత్తం -7 వాటర్ ట్యాంకులకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ సెక్రెటరీ రాధాకృష్ణ తెలిపారు.

వైసిపి పెదనందిపాడు మండల కన్వీనర్‌గా షేక్ ఖాసిం పీరా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెదనందిపాడు

పెదనందిపాడు మండలం వైసిపి కన్వీనర్ గా షేక్ కాసింపీరా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వైసిపి సాంస్కృతిక విభాగం చైర్మన్ చెరుకూరి సాంబశివరావు అధ్యక్షతన ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. షేక్ కాసింపీరా మాట్లాడుతూ మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆశీస్సులతో, మండల వైసిపి నాయకులు పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తల సహకారంతో ఈ పదవి చేపట్టినట్లు చెప్పారు.

బంధువుల ఘర్షణ - గొడ్డలితో దాడి

ప్రజాశక్తి - మాచర్ల

మండలం కంభం పాడులో ఆదివారం బంధువుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గొడ్డ లితో మరొకరిపై దాడికి పాల్ప డ్డారు. కంచర్ల గురవయ్య, కారుమంచి నరసింహా రావు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. వారి ఇళ్లు కూడా దగ్గరే ఉంటాయి. ఆయా కుటుంబాల ఆడవాళ్ళ మధ్య తగాదా విషయమై గురవయ్య కోపంతో నర సింహారావుపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ సంఘటనలో నరసింహారావుకు స్వల్ప గాయమైంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కాల్వలోని మృతదేహం వెలికతీత

ప్రజాశక్తి -కాకుమాను

మండలంలోని కొమ్మూరు నివాసి వేముల జగజ్జీవనరావు (52) ఈ నెల 7వ తేదీన మూడు గంటల సమయంలో కుమ్మరి కుంటలో పడిపోయిన గొర్రె పిల్లను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. అతని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టి బయటకు తీసినట్లు తహాశీల్దార్ ప్రసాద్ రావు తెలిపారు.

దాడి ఘటనలో అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి-గుంటూరు సిటి

వృద్ధురాలిపై దాడి చేసి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఘటన స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది . పట్టాభిపురం సిఐ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం పాత రైల్వే ట్రాక్ సమీపంలోని ఈఎస్ఐ హాస్పిటల్ దగ్గర నివాసముండే మల్లవరపు ప్రమీల దేవి (67) కొడుకు కార్తీక్ కంచు సాహితీ ప్రియాంక ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకొని తల్లికి దూరంగా నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితం తను సంపాదించిన ఆస్తితో పటు బంగారం ప్రియాంక పేరుపై రాయాలని ప్రియాంకతో పాటు ఆమె తల్లిదండ్రులు బంధువులు ప్రమీల దేవి పై ఒత్తిడి తెచ్చి బెదిరింపులకు దిగి అసభ్య పదజాలంతో దూషించి భౌతిక దాడి చేశారు. దీంతో ప్రమీల దేవి కోర్టును ఆశ్రయించి తనను బెదిరించి దాడికి దిగిన సాహితీ ప్రియాంకతో పాటు కంచు రవిశంకర్ బాబు, కంచు కృష్ణ లత, అట్లూరి భారతి లక్ష్మి, అట్లూరి వెంకటకృష్ణ, కష్ణ కుమార్, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటిఎంలో చోరీ యత్నం - యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి - గుంటూరు సిటి

ఎటిఎంను పగలగొట్టి అందులో ఉన్న డబ్బును దొంగిలించేందుకు యత్నించిన యువకుడిని అరెస్టు చేసిన ఘటన శనివారం రాత్రి లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లాలాపేట సిఐ కె.శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం 7 తేదీ రాత్రి సుమారు 2 గంటల సమయంలో మంగళగిరిలోని ద్వారకా నగర్ కు చెందిన తన్నేరు శివకుమార్ అలియాస్ వంశీకృష్ణ (20) నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చందన బ్రదర్స్ పక్కనే ఉన్న ఎటిఎం సెంటర్‌లోకి వెళ్లాడు. మిషన్‌లో డబ్బులు ఉంచే డోర్ ను పగలగొట్టేందుకు యత్నించాడు. మంగళగిరిలోని ఎటిఎం సెక్యూరిటీని పర్యవేక్షిస్తున్న ఐఐఐఎస్ సిబ్బందికి అలారం అలర్ట్ రావడంతో సిబ్బంది ఎటి ఎంలో ఉంచిన మైక్ లో కట్టిగా అరవడంతో శివకృష్ణ అక్కడి నుంచి పారిపోయాడు. ఈస్ట్ డివిజన్ పరిధిలో రాత్రి విధులు నిర్వ హిస్తున్న లాలాపేట సిఐకు కంట్రోల్ రూమ్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో రైలుపేట ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వంశీకృష్ణను అదుపు లోకి తీసుకున్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆకుల శివ ప్రసాద్

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నకరికల్లు

తాను పుట్టి పెరిగిన ప్రాంత రుణం కొంతైనా తీర్చుకోవాలన్న లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నానని నరసరావుపేట శివ కార్డియాక్ సెంటర్ అధినేత ఉదయ్ హాస్పిటల్ కన్సల్ట్ డాక్టర్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివ ప్రసాద్ అన్నారు. మండలంలోని చేజర్లలో ఆదివారం శివ కార్డియాక్ సెంటర్, గుంటూరు ఉదయ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ పెద్దలు బొడ్డపాటి భాస్కర్ రెడ్డి, అట్లూరి వెంకటరెడ్డి లు ప్రారంభించారు. గుండె సంబంధిత ఈసిజి,2డి ఎకో పాటు సాధారణ వ్యాధులైన బిపి, షుగర్, థైరాయిడ్,జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వ హించి, మందులు పంపిణీ చేశారు. చేజర్ల, జిల్లా తండా, కంకలగుంట సమీప గ్రామాలకు చెందిన 272 మందికి పైగా ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల శివప్రసాద్ మాట్లాడుతూ రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకి చెందిన తాను పుట్టి పెరిగిన ప్రాంత రుణం తీర్చుకోవాలన్న తన తండ్రి నాగేశ్వరరావు ఆశయం మేరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో శివ కార్డియాక్ సెంటర్ ఉదయ్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండాలంటే ముఖ్యంగా మానసిక ఒత్తిడికి, మద్య, ధూమపానాలకు దూరంగా ఉండాలని చెప్పారు. (శారీరక శ్రమ లేని వారు తప్పనిసరిగా కొంత సమ యం నడకకు, వ్యాయాయం, యోగా చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్య సంరక్షణ నిమిత్తం సాంప్రదాయ ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉదయ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు కె.రామారావు, బి.నాగేశ్వరరావు, ఈవూరి అప్పిరెడ్డి, జి.పిచ్చా రావు, ఈవూరి లక్ష్మారెడ్డి, చట్టు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ కవిగా దర్శి శేషారావును సన్మానిస్తున్న కళావేదిక నిర్వాహకులు

ఘనంగా జాతీయ శతాధిక కవి సమ్మేళనం

ప్రజాశక్తి- నరసరావుపేట

స్థానిక రాధ సుందర కల్యాణ మండపంలో ఆదివారం 124వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య్ర కమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించి కవులందరిని ఒకే వేదిక పైకి చేర్చడాన్ని ప్రశంసించారు. తొలుత తిలక్ విగ్రహానికి, శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పూర్వ సభ్యుడు, ప్రభుత్వ జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవులను,ప్రముఖులను ఘనంగా సత్కరించారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ కవిగా ప్రజా కవి దర్శి శేషారావును సన్మానించారు.కార్యక్రమంలో సుశీల్ మీడియా సుశీల్ కుమార్, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైసిపి నాయకులు కందుల ఎజ్రా పాల్గొన్నారు.

కోళ్ల ఫారాలపై విద్యుత్ భారాలు

- ఉచిత విద్యుత్ పథకాన్ని వీటికీ అమలు చేయాలంటున్న నిర్వాహకులు
- అప్పులకు వడ్డీలే చెల్లించలేకపోతున్నామని ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో కోళ్ల ఫారాలు ఉన్నాయి. మండల పరిధిలోని యడవల్లి, గొట్టిపాడు, మద్దిరాల, పోతవరం, కమ్మవారిపాలెం, కావూరు, తాతపూడి, బొప్పూడి, రాజపేట రామచంద్రాపురం తదితర గ్రామాల్లో ఒకప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా కోళ్ల ఫారాలు నడిచేవి. అయితే, కోవిడ్ తరువాత నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. క్రమేపి కోలుకుంటున్న నిర్వాహకులపై రకరకాల పేర్లతో విద్యుత్ భారాలు పడుతుండటం వాటిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరిగిన విద్యుత్ ఛార్జీలను కనీసం చిన్నపాటి కోళ్ల ఫారాలకైనా తగ్గించాలని రైతులు కోరుతున్నారు. ఒకవైపు నష్టాలు, మరోవైపు తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్ట లేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. రైతులకు వ్యవసాయం తర్వాత ఆదాయవనరులు సమకూర్చే వాటిగానే చూడాలే తప్ప వ్యాపార పరిశ్రమలుగా పరిగణించొద్దని కోరుతున్నారు. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల చిన్న ఫారాలు నిర్వహించే రైతులు కోలుకోలేనంతగా దెబ్బ తిన్నారు. విద్యుత్ ఛార్జీలు, ట్రాన్స్ పోర్ట్ ఛార్జీలు, ఇతర ఖర్చులు, పన్నులు భరించలేక పోతున్నామని, వాటిని మూసివేయలేని, నడపలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రైతులకు వర్తింపజేసే ఉచిత విద్యుత్ పథకాన్ని వీటికి అమలు చేయాలి లేదా సబ్సిడిపై విద్యుత్ సర ఫరా చేయాలని చిన్న కోళ్ల ఫారాల నిర్వాహకులు కోరుతున్నారు.

కోళ్లకు ఆహారాన్ని తయారు చేసే వారికి కూడా జిఎస్‌టి, విద్యుత్ ఛార్జీల మినహాయింపు ఇవ్వాలని ఫీడ్ పరిశ్రమల నిర్వాహకులు కోరుతున్నారు. లేని పక్షంలో ఫీడ్ చార్జీలు పెరిగి కోళ్ల ఫారాల నిర్వహణపై అదనపు భారం పడు తుందని అంటున్నారు. గతంలో ఒక యూనిట్ ధర రూ.3.80 పైసల చొప్పున చెల్లించే వారమని, ఫీడ్ తయారు చేసుకునే ప్లాంట్లు ఉన్నాయనే కారణం చెబుతూ ఎల్.టి పరిశ్రమగా విద్యుత్తు టారిఫ్ చూపుతూ యూనిట్ రూ. 6.70 పైసలు వంతున విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. 5 వేల కోడి పిల్లల పెంపకానికి గతంలో రూ.9 వేలు కరెంట్ బిల్లు వచ్చేదని, పెరిగిన లెక్క ప్రకారం రూ.13,000 నుండి రూ.14,000 వరకు వస్తోం దని కోళ్లఫారాల యజమానులు చెబుతున్నారు. కోళ్ల దానా ధరలు కూడా గతంలో కంటే 50 కిలోల

బస్తాకు సుమారు రూ.200 వరకు పెరిగింది. పదివేలు కోళ్లు ఉన్న ఫారంలో రోజుకు రెండు బస్తాల దానా అవసరమవుతుందని, రోజుకు రూ.400 అదనపు భారం పడుతుందని చెప్పారు. ప్రతి నెలా మేత కొనుగోలు, విద్యుత్ ఛార్జీలు,ట్రూ ఆఫ్ చార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు మొత్తం కలిపి సుమారు రూ 20,000 నుంచి రూ.25,000 వేల వరకు అదనపు భారం భరిం చాల్సి వస్తోందని పౌల్ట్రీ నిర్వాహకులు వాపోతున్నారు.

ఎస్ఎఫ్ఐ బ్రాహ్మణపల్లి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ బ్రాహ్మణపల్లి గ్రామ కమిటీ ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల సమస్యలపై భవి ష్యత్తులో మనమందరం కలిసి పోరాడాలని అన్నారు.ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఇంతవరకూ పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని అన్నారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, పీజీ చదువుకునే వాళ్లకు విద్యాదీవెన,వసతి దీవెన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 20 మంది విద్యా ర్థులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్ష కార్యదర్శులుగా జె. సంతోష్ కుమార్, ఎల్.బెన్నీ, ఉపాధ్యక్షులుగా పి.జానీ భాష, ఎస్.కె. ఇర్ఫాన్, సహాయ కార్యదర్శులుగా వై.తేజ ప్రభాస్, జె. శివకోటి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్య దర్శి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు యాసిన్, మనీ, రామకృష్ణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ నెల 2న పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక రావిపాడు రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్ర కళా పోటీల కన్వీనర్, విశ్రాంత ఉపాధ్యాయులు కట్టా కోటేశ్వర రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంబివికె విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు పిన్నమనేని మురళీ కృష్ణ మాట్లాడుతూ చిత్ర లేఖనం పోటీలకు విశేష స్పందన లభించిందని దీనికి సహకరించిన విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులకు, చిత్ర లేఖనం పోటీల కన్వీనర్ కట్టా కోటేశ్వర రావు, మాజీ ప్రధానోపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం. ఎస్.ఆర్.కె ప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో 50 విజ్ఞాన కేంద్రాలలో వారోత్సవాలు నిర్వహించేందుకు బాలోత్సవాల రాష్ట్ర కమిటీ తీర్మానం చేసిందని, డిసెంబర్ 2,3 తేదీలలో పల్నాడు విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవాలు నిర్వహించాలని స్థానిక కమిటీ సభ్యులకు సూచించారు. పల్నాడు విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న బాలోత్సవాలకు కమిటీ గౌరవ అధ్యక్షులుగా ప్రధానోపాధ్యాయుల సంఘం మాజీ గౌరవ ప్రధాన అధ్యక్షులు ఎం ఎస్ ఆర్ కె ప్రసాద్, అధ్యక్షులుగా ఆక్స్ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి, కార్యదర్శిగా కట్టా కోటేశ్వరరావు, కార్యదర్శులుగా విజ్ఞాన కేంద్రం కార్య

బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మాట్లాడుతున్న లక్ష్మీశ్వర రెడ్డి

నిర్వాహక కన్వీనర్ మస్తాన్వలి,అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, భాగేశ్వరిదేవిలు వ్యవహరిస్తారని చెప్పారు.

ఎమ్మెస్ ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూడా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చిన్నారులు పుస్తక పఠనానికి దూరమవుతున్నారని సెల్‌ఫోన్, కంప్యూటర్,టివిలతో కాల క్షేపం చేస్తూ తోటి విద్యార్థులతో కుటుంబసభ్యులతో స్నేహపూర్వక సంబంధాలను మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే పల్నాడు విజ్ఞాన కేంద్రాన్ని బహుముఖ కళారూపాల ఆవిష్కరణకు పల్నాడు విజ్ఞాన కేంద్రాన్ని వేదికగా చేయనున్నట్లు చెప్పారు.

బహుమతి అందజేస్తున్న పిన్నమనేని మురళీకృష్ణ తదితరులు

విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి కోశాధికారి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డిలు మాట్లాడుతూ నేటి విద్యా విధానం కేవలం పరీక్షలు,ర్యాంకులు, చదువుల వరకే పరిమితం కావడంతో విద్యార్థుల్లో ఉన్న అనేక నైపుణ్యాలు వెలికి రాకుండా పోతున్నాయన్నారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులలో నైపుణ్యాలను వెలికి తీయటానికి, అభ్యుదయ భావాలను రేకెత్తించడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఉత్తమ చిత్ర లేఖన విద్యార్థులకు 3 విభాగాలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు కింద 9 మందికి, ప్రతి విభాగంలో కన్సోలేషన్ బహుమతులు కింద 12 మంది చొప్పున 36 మందికి మొత్తం 45 మంది విద్యార్థులకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రశంసా పత్రం మెమోంటో, మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి, గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపిచంద్, ప్రముఖ న్యాయవాది బి సలీం, ఉపాధ్యాయులు పచ్చవ బాలాజీ, బ్రహ్మయ్య, జోజిరెడ్డి, సెల్వరాజ్, హనుమయ్య, ప్రజా సంఘాల నాయకులు కామినేని రామారావు, డి.శివకుమారి,కోయ రామారావు, ఎస్.సి.ఈ.ఆర్.టి రిసోర్స్ పర్సన్ గౌస్ పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై నిర్లక్ష్యం

రోడ్ల దుస్థితిపై రోడ్లు భవనాల శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురతున్నా వారిలో ఏమాత్రమూ చలనం లేదు. దీనికి తోడు ప్రజాప్రతినిధులు కూడా చూసి చూడనట్లే వ్యవహరిస్తున్నారు. గట్టిగా నిలదీసిన వారు కేసుల్లో ఇరుక్కోవాల్సిందే. దీనికి తోడు ప్రభుత్వం నుంచి బిల్లులు చెల్లించటంలేదని టెండర్లు ఖరారైనా కాంట్రాక్టర్లు అగ్రిమెంట్‌కు ముందుకు రావటం లేదు.

- ప్రభుత్వం నుంచి బిల్లులు రావు.. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రారు
- పట్టించుకునే తీరికే లేని ప్రజాప్రతినిధులు
- ప్రశ్నించిన వారికి వేధింపులు
- నిత్యం ప్రమాదాలబారిన పడుతున్న వాహదార్లు

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి ఆర్‌అండ్‌బి డివిజన్‌లో నిత్యం రద్దీగా ఉండే రోడ్లు అధ్వానంగా మారాయి. తెనాలి నుంచి దుగ్గిరాల వెళ్లే రోడ్డులో సోమసుందరపాలెం, ఆటో నగర్ వద్ద సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై పెద్ద గోతులు పడ్డాయి. వర్షం పడితే నీరు నిలబడి గోతులు కనబడే పరిస్థితి కూడా లేదు. పేరుకు నాలుగు లైన్ల రోడ్డుగా ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతున్నా, ప్రజలు మాత్రం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నందివెలుగు గుంటూరు మార్గం మరీ దయనీయంగా ఉంది. నందివెలుగు వంతెన మొదలు జాకీర్ హుస్సేన్ నగర్ వరకూ వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదంలో పడినట్లే. ఎరుకలపూడి అడ్డరోడ్డు- కొలకలూరు ఫ్లైఓవర్ మధ్య పెద్ద పెద్ద గోతులు. ఈ గోతుల్లో కార్లు దిగితే షాకర్లు ఎగిరిపోవాల్సిందే. కొమ్మమూరు కాల్వ వంతెనపై, దాని దిగువ భాగం, జూబ్లీ హైస్కూల్ వద్ద , సినిమా హాలు సెంటర్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎక్కడా రోడ్డు సరిలేదు. ముఖ్యంగా కోనేటిపురం కూడలికి సమీపంలో కల్వర్టు కుంగిపోయింది. రోడ్డు కింద ఉన్న తూము పగిలిపోయి, గోతులు ఏర్పాడ్డాయి. అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానికులే ఆ గోతులో బండరాళ్లు కుక్కి, ప్రమాదాలు జరగకుండా ఆ ప్రాంతంలో చెట్టు కొమ్మలను ఉంచారు. రాత్రి వేళల్లో ఎవరైనా కొత్తవారు ఈ మార్గంలో ప్రయాణిస్తే వాహనాలు ప్రమాదాల భారిన పడాల్సిందే.

గతంలో ఇదే ప్రాంతంలో పిడపర్తిపాలేనికి చెందిన పెయింటర్ బైక్ అదుపుతప్పి పడిపోయారు. తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు కూడా. కొమ్మమూరు కాల్వ వంతెనపై ఉన్న గోతిలో నందివెలుగులో హోటల్ కార్మికుడి బైక్ అదుపుతప్పి గాయాలపాలై మృతి చెందాడు. బాపయ్యపేట, ఖాజీపేట కూడళ్ళలో, ఖాజీపేట నుంచి హాఫ్‌పేట, జాకీర్ హుస్సేన్ నగర్ వరకు రోడ్డు గుంతల మయమే. నిత్యం రాత్రి వేళల్లో ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బి అధికారులు మాత్రం కనీసం మరమ్మతులపైనా దృష్టి సారించటంలేదు.

ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు లేకపోవటంతో, వారు కొత్తగా పనులు చేపట్టేందుకు ముందుకు రావటంలేదని అధికారులే చెబుతున్నారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, అవసరమైన చోట రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్లు కూడా ఖరారైనా అగ్రిమెంట్‌కు కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఇట్టే అర్ధమవుతోంది. దీంతో రోడ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. ప్రమాదకరమైన పరిస్థితులపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరికొంత మంది ప్రాణాలు పోకముందే కనీస మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

ఈ దారిలోనే ఎమ్మెల్యే ప్రయాణిస్తున్నా..

ఈ పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే స్వయంగా గమనిస్తూ కూడా రోడ్ల నిర్మాణానికి చొరవ చూపటంలేదు. గడప గడపకూ మన ప్రభుత్వం అంటూ దాదాపు 20 రోజులుగా కొలకలూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటిస్తూనే ఉన్నారు. ఆయన ప్రయాణించే వాహనాలు కూడా ఈ మార్గంలో రావాల్సిందే. నందివెలుగు-తెనాలి మధ్య నాలుగు లైన్ల రోడ్డులో కుడివైపు రోడ్డు నున్నగా ఉండటంతో రాంగ్ రూటైనా ఆయన వాహనాలకు రయ్యన పరుగెడుతున్నాయి. నందివెలుగు-జాకీర్‌హుస్సేన్ నగర్ మధ్య ఎరుకలపూడి, కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట రోడ్లు ఎంత ప్రమాద భరితంగా ఉన్నా పట్టీపట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు నిట్టూరుస్తున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం రోజునే అభివృద్ధిపై ప్రజాప్రతినిధులను నిలదీసిన ఓ యువకుడిని కేసులో ఇరికించి, వేధింపులకు గురిచేసినట్లు స్థానికులంటున్నారు.

స్పందించిన పోలీసులు

రోడ్డు ప్రమాదాల తీవ్రతను గుర్తించిన రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు స్పందించారు. ఆయా గ్రామాల ప్రజల సహకారంతో ఇటీవల టిప్పర్‌లో డస్ట్ తోలించి గోతుల్లో పోయించారు. అయితే వర్షాలకు అది కూడా లేచిపోయింది. తిరిగి యథాస్థితికి చేరింది. ప్రమాదకరంగా ఉన్న రోడ్డు ప్రయాణికులను వణుకుపుట్టిస్తోంది.

వర్షం పడితే ఖాజీపేట కూడలి పరిస్థితి(ఫైల్‌ఫోటో)

కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు

నాగేశ్వరరావు, డిఇఇ, ఆర్‌అండ్‌బి, తెనాలి.

నందివెలుగు గుంటూరు ఆర్‌అండ్‌బి రోడ్డుకు రూ.3.30 కోట్లు, నందివెలుగు-దుగ్గిరాల రోడ్డుకు రూ. 3.70 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ఖరారైనా అగ్రిమెంట్‌కు మందుకు రావటం లేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావటం లేదని కాంట్రాక్టర్లు మొండికేస్తున్నారు. నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి సమాదానమే లేదు. ఈ పరిస్థితుల్లో మేమైనా ఏం చేయగలం?

నందివెలుగు గుంటూరు మార్గంలో కోనేటిపురం వద్ద రోడ్డు దుస్థితి, నందివెలుగు-తెనాలి మార్గంలో ఆటోనగర్ వద్ద గుంతలమయమైన రోడ్డు

ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిత్రకళ పోటీల్లో వడ్డేశ్వరం జెడ్‌పి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

హైదరాబాదుకు చెందిన కాసుల చిత్రకళ అకాడమీ ఇటీవల నిర్వహించిన పోటీల్లో వడ్డేశ్వరం జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'రామాయణం' అంశంపై పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎస్.శిరీష కాంస్య పతకం సాధించగా మరో 12 మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం జి.సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.జోజప్ప, చిత్రకళ ఉపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణ, బుజ్జిబాబు, సుందర్‌రాజు, పద్మావతి, జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

మురుగుడు హనుమంతరావును సన్మానిస్తున్న పద్మాశాలీ సంఘం నాయకులు

ఎమ్మెల్సీ హనుమంతరావుకు సన్మానం

ప్రజాశక్తి-మంగళగిరి

ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును ఆదివారం సాయంత్రం ఆయన నివాసంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం అధ్యక్షులు సిహెచ్ కనకయ్య, కార్యదర్శి దామర్ల కుబేర స్వామి, సంఘం సభ్యులు గంజి రవీంద్రనాథ్, ఆర్ పూర్ణచంద్రరావు, ఎస్.భూపతి కలిపి శుభాకాంక్షలు తెలిపారు.

నివాళులర్పిస్తున్న పిన్నమనేని మురళీకృష్ణ తదితరులు

డ్యాన్స్ మాస్టర్ రవితేజకు పితృవియోగం

ప్రజాశక్తి-తాడేపల్లి

మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం తరపున వివిధ పాఠశాల్లోని బాలబాలికలకు డ్యాన్స్, కోలాటం నేర్పిస్తున్న మాస్టర్ నీలి రవితేజ (చందు) తండ్రి నీలి శ్రీనివాసరావు (52) ఆదివారం మృతిచెం దారు. కొంతకాలంగా అనార్యోగంతో చికిత్స పొందుతున్న ఆయనకు ఆదివారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతిచెందారు. శ్రీనివాసరావుకు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ, అమరావతి ఐకాన్ ఫ్రెండ్స్ బృందం తరుపున యడ్ల బాలకృష్ణ, విజయవాడ ఎంబివికె పి.విజయ, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి జి.సుబ్బారెడ్డి, ప్రజానాట్య మండలి నాయకులు కె.కరుణాకరరావు నివాళులర్పించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ తదితరులు

యాక్సెంచర్‌లో మలినేని విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులకు బహుళజాతి కంపెనీ యాక్సెంచర్‌లో ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ కె.శ్వేత తెలిపారు. రూ.4.5 లక్షల నుండి రూ.6.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఆర్థిక మాంద్యంలోనూ యాక్సెంచర్ వంటి బహుళజాతి కంపెనీలో తమ విద్యార్థులకు ఉద్యోగాలు లభించటం ఆనందంగా ఉందని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కాలేజి చైర్మన్‌తోపాటు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

మీడియా మేనేజ్ మెంట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబిఎ మీడియా మేనేజ్మెంట్, ఎంబిఎ టెక్నాలజీ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబిఎ కోర్సులకు ఆదరణ మెండుగా ఉందని, ఈ కోర్సులో ప్రవేశాలకు ఐసెట్ రాసిన అభ్యర్థులతో పాటు రాయని వారికి కూడా అవకాశం ఉన్నట్లు తెలిపారు. మీడియా మేనేజ్మెంట్ కోర్సుకు ఏదైనా సాధారణ డిగ్రీ ఉత్తీర్ణతను అర్హతగా నిర్ణయించామని, ఎంబిఎ టెక్నాలజీ మేనేజ్మెంట్‌కు బీటెక్ లేదా బిఇ కోర్సులలో ఏదైనా ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కోర్సులకు ఇప్పటికే కొన్ని సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. ఐసెట్ ద్వారా ఎంబిఎ కోర్సులకు ప్రవేశాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంబిఎ మీడియా మేనేజ్మెంట్, ఎంబిఎ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఎంబిఎ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తుల కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో అన్ని నిష్ణాతులైన అధ్యాపకులతో పాటు ఆధునిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, వివిధ పరిశ్రమలకు చెందిన సీనియర్ పారిశ్రామిక వేత్తలతోనూ ఆయా కోర్సులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

కార్మికులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

ప్రతి పేదవాడి కల సొంత ఇల్లు అని వారి కల సాకారం దిశగా ఇళ్ళ పట్టాలు చేస్తున్నామని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు.ఆదివారం పట్టణంలోని 33వ వార్డులోని ఆదర్శ కాలనీఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కాసు మాట్లడుతూ ఎనోన ఏశల్లుగా ఈ ప్రాంతంలోని సున్నపు బట్టీలలో,క్వారీలలో పనిచేస్తూ, పరిశ్రమల పక్కనే ఉన్న ఈ ప్రాంతంలో 15 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఇప్పటికీ నివాసాలకు సరైన గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్న ఆదర్శకాలనీ వాసులకు తమ ప్రభుత్వం ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తోందని అన్నారు. ఎంతో మంది కార్మికులు కష్టపడి ఈ కాలనీని ఏర్పాటు చేసుకున్నారని, కూలి పనులు చేసుకుంటూ వచ్చిన కూలీ డబ్బులుతో జీవన సాగించే కార్మికులు సొంత స్థలం కోనుగోలు చేసుకోలేరని ,వారికి వచ్చే ఆదాయం కుటంబ అవసరాలకు సరిపోతుందని, అలాంటి వారికి జగన్ ప్రభుత్వం తోడుగా ఉంటుందని అన్నారు. కార్మికులు నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఈ ప్రాంతం క్వారీ పరిధిలో ఉండటంతో గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయించి క్వారీయింగ్ చేసుందుకు సన్నద్ధమైందని, ప్రభుత్వం మారడంతో ఈ కాలనీ నిలబడిందని లేకుంటే ఈ సమయానికి ఇక్కడ క్వారీ పనులు జరుగుతుండేవని అన్నారు. ఈ కాలనీలో 800 ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల పట్టాలు ఉంటే ఇంకా ఎవరూ ఖాళీ చేయించలేరనే భరోసా వారికి ఇచ్చారు. పట్టా ఉంటే ఇంటి నిర్మాణానికి లోన్‌లు ఇప్పిస్తామని వారికి చెప్పారు. కాలనీలో ఇప్పటికే డ్రైనేజి నిర్మాణం చేపట్టామని, త్వరలోనే పిడుగురాళ్లలో ఏర్పాటు చేసినట్లు ప్రతి ఇంటికి కృష్ణనీరు అందిస్తామని, రోడ్లు నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ ప్రాంతానికి సమీపంలో ఉన్న బైపాస్ నిర్మాణం పూర్తి అవుతుందని, ఈ ప్రాం తానికి మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. మెడికల్ కళాశాల కూడ వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కాలనీలో ప్రధానంగా వాలంటీర్ వ్యవస్థ ,సచివాలయ సేవలు అందుబాటులో ఉండటం లేదని పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారని, నెల రోజుల వ్యవధిలో అధికారులతో చర్చించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ వాసులకు ఇళ్ళ పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చక్రవర్తి పాల్గొన్నారు,

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

టిటిడి కళ్యాణ మండపం ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరులో కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ. 2 కోట్లు నరస రావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శం కరరావు మంజూరు చేయించారు. 75 తాళ్లూరులో కళ్యాణ మండపం నిర్మించే స్థలాన్ని ఆదివారం ఎంపి, ఎమ్మెల్యే పరి శీలించారు. దీని నిర్మాణానికి గ్రామ స్తుల వాటాగా రూ. 40 లక్షలను గుత్తికొండ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గుత్తికొండ రామ కృష్ణారెడ్డి కుటుంబం రూ.11,75,000, గుత్తికొండ తిరుపతిరెడ్డి కుటుంబం రూ. 8,25,000, జొన్నల వెంకటరెడ్డి కుటుంబం రూ.8 లక్షలు, గుత్తికొండ అప్పిరెడ్డి రూ.2 లక్షలు, నిత్యానందరెడ్డి రూ.10 లక్షలు (అరబిందో ఫార్మా కంపెనీ) విరాళంగా ఇచ్చారు. రూ.40 లక్షల డిడిలను, కళ్యాణ మండ పం నిర్మాణానికి కేటాయించిన ఎకరం స్థలం పత్రాలను ఎంపి, ఎమ్మెల్యే ద్వారా టిటిడి అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ మండపం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, ఇది తాళ్లూరు చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విరాళం ఇచ్చిన దాతలను వారు అభి నందించారు.

మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు, చిత్రంలో ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

చంద్రబాబు కోసం వృద్ధుడి పాదయాత్ర

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

టిడిపి జాతీయ అధ్యక్షులు అధినేత నారా చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 70 ఏళ్ల వృద్ధుడు చింతల నారాయణ రాజమండ్రికి పాద యాత్ర చేపట్టారు. నంద్యాల జిల్లా బండి ఆత్మక ూరు మండలం చిన్నదేవళాపురం నుంచి యాత్ర ప్రారంభించిన వద్ధుని పాదయాత్ర ఆదివారం నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నరసరావుపేట నియోజకవర్గ టిడిపి బాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాదయాత్ర చేస్తున్న నారాయణను కలిసి సంఘీభావం తెలి పారు. నారాయణ మాట్లాడుతూ రాజమండ్రి వరకు పాదయాత్ర చేసి చంద్రబాబు కుటుంబానికి సంఘీభావం ప్రకటిస్తానని, ప్రతి ఒక్కరూ చంద్ర బాబుకు అండగా నిలవాల్సిన సమయమన్నారు.

చింతల నారాయణను అభినందిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ఆధునిక జీవనశైలితో మానసిక సమస్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మానసిక రుగ్మతలపై ఆరోగ్య సభ నిర్వహించారు. కాటూరి మెడికల్ కాలేజి మానసిక వైద్యులు ప్రొఫెసర్ కె.సురేష్‌కుమార్ ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాలంలో సమాజంలో చాలా మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, దీనికి కారణంగా ఇతరులతో పోల్చుకోవటం, అందని స్థాయిని అందుకోవాలని ఆశపడి, ఫలితం లేక నిరుత్సాహంతో కుంగిపోవటం, అడ్డదారులలో లక్ష్యాలను సాధించే ప్రయత్నం చేసి విఫలమవటం, అనవసర ఖర్చులు పెంచుకొని, ఆఖర్చులకు తగిన ఆదాయం లేక ఇలా చెప్పుకుంటూ పోతే చాలా కారణాలున్నాయని చెప్పారు. పూర్వం ఉమ్మడి కుటుంబంలో సమస్యలు వస్తే తోడుగా అన్నదమ్ములు, పెద్దలు ఉండేవారని, ఈరోజుల్లో ఆ పరిస్థితి లేకపోవటం కూడా మానసిక సమస్యలకు కారణం అన్నారు. సమస్యలు వచ్చినప్పుడు మన మంచికోరే వ్యక్తులతో పంచుకోవాలని, అప్పుడు మనసుకు ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. పెద్దవారిలో అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ సమస్యల గురించి వివరించారు. అల్జీమర్స్ వయస్సుతోపాటు పెరుగుతుందన్నారు. మొదట చిన్న చిన్న విషయాలు, ఆ తర్వాత చుట్టు పక్కల వారిని కూడా మర్చిపోయిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. పార్కిన్ సన్స్ పెద్ద వారిలో వచ్చే నరాల సమస్య అని, దీనిని నియంత్రించటం తప్ప, పూర్తిగా నయం చేయలేమన్నారు. అల్జీమర్స్ రాకుండా పజిల్స్ చేయటం, కొత్త విషయాలు నేర్చుకునే ప్రయత్నం చేయాలని, ఇష్టమైన వారితో కాలం గడపటం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

పిల్లలను చదువు విషయంలో ఒత్తిడి చేయకుండా ఆసక్తి ఉన్న విషయాల్లో ప్రోత్సాహం అందించాలన్నారు. వారితో స్నేహితులుగా మెలగాలన్నారు. సభలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిమానస, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ యాస్మిన్, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు. టివి.సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

ముస్లిం మైనారిటీల సదస్సులో మాట్లాడుతున్న బొర్రా అప్పారావు

'మైనారిటీలను మోసం చేస్తున్న జగన్'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఇస్లాం బ్యాంకు ఏర్పాటు చేసి దానిద్వారా ముస్లిం మైనారిటీలకు రుణాలు ఇస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మోసం చేశారని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ జిలానీ విమ ర్శించారు. సత్తెనపల్లి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఆద్వర్యంలో మైనారిటీల ఆత్మీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు అద్యక్షత వహించారు. ఈసందర్భంగా జిలానీ మాట్లాడుతూ మైనారిటీ కార్పోరేషన్ ఏర్పాటు చేసి పేద ముస్లింకు ఋణాలు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.బొర్ర అప్పారావు మాట్లాడుతూ జనసేన మైనారిటీ లకు అండగా వుంటుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం ముస్లిం హక్కులను కాలరాస్తుందనీ విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఖాసిం సైదా, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ ముస్లిం మైనారిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మ్యూజియంను సందర్శించిన కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని మ్యూజియం, తాడేపల్లి వద్ద ఉండవల్లి గుహలను కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయమంత్రి మీనాక్షి లేఖి ఆదివారం సందర్శించారు. మ్యూజియంలోని శాతవాహనుల కాలపు కళాఖండాలను, అమరావతి శిల్ప సాంప్రదాయాలను గురించి మంత్రికి ఆర్కియాలజిస్ట్ కమల్ హాసన్ వివరించారు. మ్యూజియం లోని పాలరాతి శిల్పాలను, ఏకశిలా నంది విగ్రహము, అమరావతి స్తూపము, ప్రాకారం నమూనాలను చూశారు. మంత్రి వెంట అమరావతి సర్కిల్ డిఇ వీరాంజనేయులు, ఎఇలు భానుప్రకాష్‌వర్మ, దేవేంద్ర భోయి, మొహద్, సిఎ నాగేంద్ర, రాజు, గార్డెన్ ఇన్‌ఛార్జి నరేష్, మ్యూజియం సిబ్బంది చిన్నబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'మంత్రి రాంబాబు వ్యాఖ్యలు అప్రజాస్వామికం'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు అప్రజాస్వామిక మని టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు మద్దినేని వెంకట చలపతి రావు ధ్వజమెత్తారు. సత్తెనపల్లి టిడిపి కాంగ్రెస్ ఆదివారం లీగల్ సెల్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని మంత్రి, పాత్రికేయులపై విరచుకుపడటం, అసహనం వ్యక్తం చేయడాన్ని ఖండించారు. జలవనరుల శాఖపై పట్టుకోల్పోయిన మంత్రి పరిహాహసం పాలై పరాజయం పొందే రోజులు దగ్గరబడ్డాయన్నారు. రాజ్యాంగ వ్యస్థలపట్ల అప్రజాస్వామికంగా వ్యవహరించడం వైసిపి సంస్కృతీ సంప్ర దాయమని విమర్శించారు. సభ్యులు ఎ.జయరాం, షేక్ జానీ ఖాజావాలి, జి. వసంతరావు, డి.శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు పాల్గొన్నారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ రహంతుల్లా

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక జమాయతుల్ ఫిర్ధోస్ మసీద్ కమిటీ ఎన్నిక శనివారం విజయపురిసౌత్ లో నిర్వహించారు.మసీద్ కమిటీ అధ క్షుడిగా సయ్యద్ రహంతుల్లా ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు.ఉపాధ్యక్షుడు గా ఎస్కే అన్వర్,కార్యదర్శిగా ఎస్కే జానీ,జాయింట్ సెక్రటరీ ఎస్ కే సలామ్, కోశాధికారులుగా ఎస్.జానిబాషా,పి. వినయతుల్లా,ప్రధాన సలహదారుడిగా ఎస్కే మస్తాన్ వలి లు ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

న్యూజిలాండ్‌లో తెలుగు సభలకు శాంతమూర్తికి ఆహ్వానం

ప్రజాశక్తి - గుంటూరు సిటి



న్యూజిలాండ్ రాజధాని అయిన హాక్ల్యాండ్‌లో ఈనెల 28న జరిగే తెలుగు సభలకు గుంటూరు నగరంలోని గోరం ట్లకు చెందిన చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవ స్థాపకుడు జి.శాంతమూర్తిని ప్రత్యేక అతి థిగా మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రెజినాల్డ్ శామ్యూల్ ఆహ్వానించారు. అసోసియేషన్ నిర్వహించే ఈసభ ఫ్రీమాన్స్ బే కమ్యూనిటీ హాల్, 52 హెప్బర్న్ స్ట్రీట్, ఫ్రీమాన్స్‌లో జరగనుంది.

12 నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ

- మంగళగిరి స్టేడియంలోనూ మ్యాచ్‌లు
- వీక్షకులకు ఉచిత ప్రవేశం : ఎసిఎ

వివరాలు వెల్లడిస్తున్న ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అండర్ - 19 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 12వ తేదీ నుంచి మంగళగిరి, మూలపాడు క్రికెట్ స్టేడియంలలోని మూడు వేదికల్లో ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్. గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే టోర్నీలో భాగంగా మూలపాడులో ఉన్న డీవీఆర్, సీపీ గ్రౌండ్, మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, మేఘాలయ, హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయని వెల్లడించారు. మ్యాచ్ తిలకించాలనే వారికి ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. మంగళగిరి స్టేడియంలో మరో ఆరు నెలల పాటు సందడి నెలకొనేలా మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి బీసీసీఐ ఈ టోర్నీని రాష్ట్రానికి కేటాయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇందులో భాగంగానే రూ.15 కోట్లతో మంగళగిరి స్టేడియంలో ఫ్లడ్ లైట్లు వేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ ఎ.రాకేష్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్లు కె.వి. పురుషోత్తంరావు, ఎన్.గీత, గుంటూరు క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పప్పి, సీఈఓ డాక్టర్ ఎం.వెంకటశివారెడ్డి, సెంట్రల్ జోన్ అకాడమీ కన్వీనర్ డి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న తులసి రామచంద్ర ప్రభు కుటుంబ సభ్యులు

అనాధ పిల్లలకు అన్నదానం

ప్రజాశక్తి - గుంటూరు సిటి

తులసి రామచంద్ర ప్రభు, బిజెపి నాయకులు తులసి యోగీష్ ఆదివారం చౌడవరంలోని చేతనపూరిలో హీల్ (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ అల్) సంస్థలోని 125 మంది పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెషనల్ కమిటీ మెంబెర్ తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తల్లితండ్రులు లేని పిల్లలకుకు తోడుంటున్నామని, కుటుంభంలో ఎటువంటి శుభకార్యం జరిగిన ఇటువంటి కార్యక్రమాలు చేస్తుంటామని చెప్పారు. హీల్ ఆధ్వర్యంలో 10వ తరగతి పైబడి చదువుకునే విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తామన్నారు. తులసి యోగీష్ మాట్లాడుతూ రామచంద్ర ప్రభు స్కాలర్షిప్‌లతో చదుకున్నారని, ఆ విషయాన్ని మరువకుండా ఇప్పటి వరకు కొన్ని వేలమంది విద్యార్థులకు రూ.20 కోట్లపైగా ఉపకారవేతనాలు, పుస్తకాలు, నోట్స్, అల్పాహార పంపిణీ చేస్తుంటామని చెప్పారు. శరణాలయానికి మౌలిక వసతులు అవసరముంటే తమ దృష్టికి తేవాలని, వాటిని సమకూరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 125 మందికి స్వయంగా భోజనాలు వడ్డించి, వారితో కలిసి తులసి రామచంద్ర ప్రభు, తులసి యోగీష్ భోజనం చేశారు. కార్యక్రమంలో తులసి సీడ్స్ డైరెక్టర్ తులసి అరుణ, రాంబాబు, సుమతి, హీల్ కో-ఆర్డినేటర్ మరుద్వతి, సూపరింటెండెంట్ పద్మ, హోం మదర్స్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి

పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బ్రాంచ్ కార్యాలయంలో ఇద్దరు పేద చేనేత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. పి.ఆదిసుదర్శన సుందర్‌రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు పి.అజయ్ రూ.10 వేలు అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎఎస్‌కె డాంగే, కార్యదర్శి జి.ధనుంజయరావు, సభ్యులు బి.నారాయణ, జి.రవీంద్రనాథ్, జి.కస్తూరి మరో రూ.15 వేలను పేద విద్యార్థికి అందజేశారు.

ఏడిఆర్ఎం క్రికెట్ టీమ్‌తో డిఆర్ఎం ఇతర అధికారులు

ఉత్సాహంగా డిఆర్ఎం కప్ స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి-గుంటూరు

గత రెండ్రోజులుగా రైల్వే డివిజనల్ మేనేజర్ పరిధిలో నిర్వహిస్తున్న డిఆర్ఎం కప్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక డిఆర్ఎం కాంపౌండ్‌లో నిర్వహించిన షటిల్ డబుల్స్‌లో 32 టీమ్స్ పోటీ పడ్డాయి. గుంటూరుకు చెందిన విజయ్‌సాయిరెడ్డి, జితేంద్ర టీమ్ గెలుపొందింది. సిద్ధార్థ్ గౌతమ్, జయంత్ రెండో స్థానంలో, అబ్బాస్-సాయి, జి.రాజ్‌పాల్-షేక్.రియాజ్‌లు మూడు, నాలుగో స్థానంలో నిలిచారు. వాలీబాల్‌కు మొత్తం 16 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఆదివారం సాయంత్రం పోటీలు ప్రారంభం అయ్యాయి. ఇక క్రికెట్‌కు సంబంధించి 7, 8 తేదీల్లో లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం 6 జతల జట్ల మధ్య పోటీలు జరిగాయ. ఈనెల 14, 15 తేదీల్లోనూ క్రికెట్ పోటీలు కొనసాగుతాయి. 15న ముగింపు కార్యక్రమంలో విజేతలను ప్రకటిస్తారు. పోటీలను డిఆర్ఎం రామకృష్ణ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

రెండు ఆశ్రమాల్లో చిన్నారులకు అన్నదానం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని రెండు ఆశ్రమాల్లో చిన్నారులకు దాతలు ఆదివారం భోజనాలు సమకూర్చారు. కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున నిడుబ్రోలు క్యాబిన్‌పేటలో నిర్వహిస్తున్న వివేకానంద సేవ సమితి ఆశ్రమంలో చిన్నారులకు గుమ్మడి హరి ఆశాజ్యోతి దంపతులు తమ కుమారుడు గగన్ శ్రీ సత్య పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. మండలంలోని బ్రాహ్మణ కోడూరు చైల్డ్ హోమ్‌లో చిన్నారులకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరం మండలం కుతుకూలురులో ఉన్న హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు పులగం నాగిరెడ్డి ఆధ్వర్యంలో పులగం సుధాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో కె.వి.ఆర్ ట్రస్ట్ చైర్మన్ విజయకుమార్, సభ్యులు మంద్రు కిరణ్‌కుమార్, భాస్కర్, రవన్న, వంశీ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తెనాలిరూరల్

శ్రీ అంజలి మల్టీస్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నిర్మల ప్రథమ చికిత్సా కేంద్రం నిర్వహకులు ఆర్ఎంపి డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శిబిరాన్ని 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య ప్రారంభించారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, మెదడు, రక్తపోటు, ఎముకలు మధుమేహం, శ్వాసకోస వ్యాధులకు సంబంధించి ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ బి.నాగరాజు వైద్యం అందించారు. ఇసిజి, పిఎఫ్టి పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. డాక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, ఊపిరితిత్తులు, గుండె, మధుమేహ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి రాకముందే జాగ్రత్తలు వహించాలన్నారు. శిబిరంలో 500 మందికి పైగా వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు టి.వాసు, పి.వెంకటేశ్వరరావు, ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు కె.రత్నాకర్, ఎ.శ్యామ్‌సాగర్, ఎం.సుబ్బారావు, ఎ.సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

వైద పరీక్షలు చేస్తున్న డాక్టర్ దుర్గా ప్రసాద్

కృత్రిమ చేతుల కావాల్సిన వారు సంప్రదించండి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రోటరీ క్లబ్ వారి ఎల్ఎన్ 4వ కృత్రిమ చేతుల పంపిణీ ప్రాజెక్టు ప్రమోషన్‌లో వాకర్స్ అసోసియేషన్ భాగస్వామ్యం ఉంటుందని ప్రాజెక్ట్ చైర్మన్ ఐ.అనిల్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం మంగళగిరి సమీపంలోని ఎకో పార్కులో వాకర్స్ అసోసియేషన్, నేచర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. డిసెంబర్ 10వ తేదీన మంగళగిరి పట్టణంలో గల రాయల్ కన్వెన్షన్ హాలులో చేతులు లేని 500 మందికి రూ.1.80 కోట్లతో కృత్రిమ చేతులు ఉచితంగా పంపిణీ చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కృత్రిమ చేతులు కావాల్సిన వారు 7207403150 నంబర్‌కు సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మంగళగిరి రోటరీ క్లబ్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, అధ్యక్షులు ఎ.రేవంత్, మాజీ అధ్యక్షులు వంశీకృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు, కె.సుందరయ్య, చిన్ని తిరుపతయ్య, జి.చిరంజీవి పాల్గొన్నారు.

నిత్యం వ్యర్థాల దుర్గంధం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి కొత్త బస్టాండ్ ఎదుట ఆసుపత్రుల రహదారిపై నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. ఇదే ప్రాంతంలోని వివిధ ఆసుపత్రులకు రోగులు వస్తుంటారు. ఇక్కడున్న ఓ ఖాళీ స్థలంలో కొంతమంది తరచూ వ్యర్థాలను పడేస్తుండడం, వాటిని మున్సిపాల్టీ వారు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇది అటుగా రాకపోకలు సాగించే వారికి అసౌకర్యంగా మారింది.

నరసింహరావుకు మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండలంలోని ఉప్పలపాడు మాజీ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు మావయ్య పాండేటి నరసింహారావు శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ కె శ్రీనివాసరావు, టిడిపి నాయకులున్నారు.

మూడ్రోజుల పాటు అర్జిత సేవలు రద్దు

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకాని శ్రీమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో జరుగు పవిత్రోత్సవాల సందర్భంగా రాహు కేతు పూజలు సహా అన్ని అర్జిత సేవలు నిలిపివేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుండి అమావాస్య సందర్భంగా ఉదయం 5 గంటల నుండి రాహు కేతు పూజలు, శ్రీ స్వామివారికి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, అన్ని అర్జిత సేవలు యథాతథంగా నిర్వహిస్తామని తెలిపారు.

జిజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

- వచ్చే ఏడాదికల్లా ఎంసిహెచ్ భవన సముదాయం పూర్తి
- ఫోన్లకు పరీక్షల నివేదికలు,స్కానింగ్ వివరాలు
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. అన్నిస్థాయిల్లో పర్యవేక్షణ పెంచుతున్నట్టు తెలిపారు. ఆస్పత్రి అత్యవసర విభాగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అత్యవసర కేసులకు వీలైనంత త్వరగా చికిత్సలు అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు చెప్పారు.

అత్యవసర విభాగాన్ని ప్రక్షాళన చేశారా?

అత్యవసర విభాగంలో మంచాల కొరతను నివారించాం. ఈ విభాగంలోకి వచ్చిన వెంటనే ప్రాథమిక చికిత్సలు చేసి వెంటనే వార్డుకు పంపేవిధంగా ఏర్పాటు చేశాం. ఎక్కువ సేపు స్ట్రెక్చర్‌పై ఉంచే విధానాన్ని పూర్తిగా తొలగిం చాం. సీనియర్ వైద్యులను నిరంతరం అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ప్రధా నంగా క్యార్డియాలజిస్టు, న్యూరో సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. బ్లడ్ బ్యాంకును కూడా 24 గంటలు అందుబాటులోకి తెచ్చాం. అత్యవసర విభాగంనుంచి స్టెప్‌డౌన్ ఐసియుకి పంపేలా రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు, 30 పడకలు ఉండేలా పనులు జరుగుతున్నాయి. నెలరోజుల్లో ఈ విభాగం సిద్ధమవుతుంది. వెంటిలేటర్ ఐసియూ సిద్ధమైతే ఎక్కువ మంది రోగులు ప్రాణాపాయం నుంచి బయటపడతారు. జీరో అవర్ ట్రీట్‌మెంట్‌ను గోల్డ్‌న్ అవర్‌గా మార్చాలని కోరుతున్నాం. రెండో ఆపరేషన్ థియేటర్ ప్రారంభించిన తరువాత ఈ విభాగంలోచాలా వరకు సమస్యలు తగ్గాయి.

ఎంసిహెచ్ నూతన భవన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుంది?

మాత శిశుసంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్) రూ.80 కోట్లతో 600 పడలక సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ భవన సముదాయం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఖర్చును పూర్తిగా గుంటూరు మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులే భరిస్తున్నారు. గైనకాలజీ, ప్రసూతి విభాగం, చిన్న పిల్లల సంరక్షణ, శస్త్రచికిత్సల విభాగం మొత్తం ఈ భవనంలోనే ఉంటాయి. సెల్లార్‌తో పాటు మరో ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మూడో అంతస్తు శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఈ సముదాయం సిద్ధమైతే ఆస్పత్రిలో ప్రస్తుతం గర్భిణీలకు కష్టాలు తొలగినట్టే.

ఒపి విభాగంలో ఎదురవుతున్న సమస్యలు?

ఆయుష్మాన్ భారత్ చికిత్సల్లో భాగంగా ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు తప్పని సరిచేశారు. అంతేగాక పరీక్షల వివరాలు, ఎక్స్‌రే, స్కానింగ్ నివేదికలు ఫోన్లకు పంపడానికి ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు అవసరం ఉంది. ఇందుకోసం వీటి వివరాల నమోదుకు జాప్యం జరుగుతోంది. గతంలోకేవలం పేరు చెబితే ఒపి స్లిప్ ఇచ్చేవారు. ఇప్పుడు వీటి వివరాలు నమోదు వల్ల కొంత జాప్యమవుతోంది. జాప్యం నివారణకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఫోన్ నెంబరు లేని వారు కనీసం వారి వాలంటీర్ నెంబరు అయినా ఇవ్వాలని కోరుతున్నాం. ప్రస్తుతం నాలుగైదు కౌంటర్ల వల్ల తొక్కిసలాట జరుగుతోంది. ఇందుకోసం మరో 11 కౌంటర్లు ఏర్పాటుకు నిర్ణయించాం.

ఒపి విభాగంలో నిత్యం ఎంత మంది వస్తున్నారు?

గతంలో 1500 మంది వచ్చేవారు. ఇప్పుడు 3500 మంది వస్తున్నారు. అత్యవసర విభాగానికి 750 మంది వరకు వస్తున్నారు. ఒపి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా చూస్తున్నాం. ఆస్పత్రిలో ఇన్‌పెషెంట్స్ 1600 మంది వరకు ఉంటున్నారు. నాల్గో తరగతి సిబ్బంది సంఖ్య బాగా తక్కువగా ఉండటం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో 600 మందికి గాను 120 మంది ఉన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మగ్గాల షెడ్డులను పరిశీలించిన కేంద్రమంత్రి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలో రాజీవ్ గృహకల్పలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన మగ్గాల షెడ్లను ఆదివారం సాయంత్రం కేంద్ర కల్చరల్ మంత్రి మీనాక్షి లేకి పరిశీలించారు. అనంతరం చేనేత వస్త్రాల దుకాణాలను పరిశీలించారు.

పట్టుకుంటే ఏడాదికి రూ.2-3 లక్షల ఆదాయం

- రైతులతోపాటు యువకులకూ ఉపాధి
- మల్బరీ సాగుకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీలు
- ప్రజాశక్తితో పట్టు పరిశ్రమ శాఖ పల్నాడు జిల్లా అధికారి పి.రాధారాణి

నూతన సాంకేతిక పద్ధతులు అవలంబించి తక్కువ నీటి వనరుల ద్వారా బిందు సేద్యం విధానంలో కనీసం రెండెకరాల్లో మల్బరీ సాగు చేపట్టి పట్టు పరిశ్రమ స్థాపిస్తే ప్రతినెలా ఆదాయం పొందొచ్చని పట్టు పరిశ్రమ శాఖ పల్నాడు జిల్లా అధికారి పి.రాధారాణి చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగమైన పట్టు రైతులతోపాటు యువతకూ ఉపాధి కల్పిస్తుందన్నారు. మల్బరీ సాగు ద్వారా పట్టు పరిశ్రమ స్థాపిస్తే ఏడాది పొడువునా ఆదాయం వస్తుందని, వీటిని ఇసుక, మాగాణి, బీడు, చౌడు భూములు మినహా అన్ని రకాల నేలల్లో సాగు చేయొచ్చని తెలిపారు. పట్టు పరిశ్రమ స్థాపనకు ముందుకొచ్చే వారికి తమ శాఖ ద్వారా సలహాలు, సూచనలతోపాటు ప్రభుత్వ సహకారమూ ఉంటుందన్న ఆమె పట్టు పరిశ్రమపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

పట్టు రైతులకు ప్రభుత్వం అందించే సాయం?

ఎకరా మల్బరీ తోటకు 5500 మొక్కలను ఉచితంగా ఇస్తాం. వీటిని నాటేందుకు అయ్యే ఖర్చును మొక్కల సంఖ్య ఆధారంగా గరిష్టంగా ఏడాదికి రూ.18,750 ప్రోత్సాహకంగా మూడేళ్ల పాటు ప్రభుత్వం సాయం చేస్తుంది. పట్టు పరిశ్రమ స్థాపనకు రైతులు ముందుకొస్తే మల్బరీ తోట పెంపకం దగ్గర నుండి షెడ్ నిర్మాణం, నిర్వహణకు సంబంధించి ఔషధాలు వరకు 75 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలైతే 90 శాతం రాయితీలను 'సిల్క్ సమగ్ర', ఆర్.కె.వి.వై పథకాల కింద లభిస్తాయి.

ఇంకా ఎలాంటి ప్రోత్సాహకాలు ఉంటాయి?

పరిశ్రమ స్థాపించిన అనంతరం ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్లో అమ్మిన సి.బి రకం పట్టు గూళ్లకు కిలోకు రూ.20 చొప్పున, బి.వి రకం పట్టుగూళ్లకు కిలోకు రూ.50 చొప్పున ప్రోత్సాహకం ఇస్తుంది. చిన్న వయసు పట్టు పురుగుల పెంపకం కేంద్రం చాకీ సెంటర్ నందు పట్టు పురుగులు చాకీ కట్టించి పెంచిన రైతులకు ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ నందు 100 బి.వి. గుడ్లకు రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహం ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు రూ.1800 ఇస్తుంది.

పల్నాడు జిల్లాలో ఎన్ని పరిశ్రమలున్నాయి? ఎంతమంది ఉపాధి పొందుతున్నారు?

పల్నాడు జిల్లాలో 200 ఎకరాలకుపైగా మల్బరీ సాగవుతున్నాయి. 60కు పైగా యూనిట్లు విజయవంతంగా కొనసాగు తున్నాయి. పరిశ్రమ నిర్వాహకులు కాకుండా వీటిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు.

పరిశ్రమలు విజయవంతం కాకపోవడానికి కారణం?

పల్నాడు జిల్లాలో వాణిజ్య పంటలైన మిరప తోటలకు దగ్గరగా ఉన్న పట్టు పరిశ్రమలు మాత్రమే విజయవంతంగా కొనసాగలేకపోతున్నాయి. మిరప తోటలకు వినియోగించే క్రిమిసంహారక మందులు ప్రభావం సమీపంలోని మల్బరీ తోటలు సాగుపై పడుతోంది. ఆకు చూసేందుకు ఆరోగ్యంగా ఉన్నా వాటిని తిన్న పట్టు పురుగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒకసారి మిరపతోట సాగు చేసిన భూమిలో కనీసం 3 నుండి 4 ఏళ్ల వరకు మల్బరీ తోటకు అనుకూలంగా ఉండవు.

షెడ్ల నిర్మాణం సంరక్షణ ఎలా?

మల్బరీ తోట ఉన్న భూమిలోనే షెడ్ నిర్మాణం ఉంటే పరిశ్రమ నిర్వహణకు సులభంగా ఉంటుంది. ఊరి బయట పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేసుకోవాలి. 50 అడుగుల పొడవు 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు 20 అడుగుల వెడల్పుతో షెడ్లు నిర్మించాల్సి ఉంటుంది. షెడ్ వ్యయం రూ.4 లక్షలైతే ఓసి, బీసీలకు 75 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీ ఇస్తారు. న్యూస్ పేపర్ పరిచి మల్బరీ కొమ్మలు వేయాలి. నేత్రికలు చాకి కట్టెలు ఏర్పాటు చేయాలి. షెడ్‌లో సున్నం, బ్లీచింగ్ కొట్టడంతో క్రిమి కీట కాలు నశించి పోవడం తెగులు అనేది ఉండదు. పురుగులకు ఆహారంగా వేసిన మల్బరీ ఆకు అధిక సమయం తాజాగా ఉంటుంది.

పంట ఎంతకాలం వస్తుంది?

ఒకసారి మల్బరీ సాగు చేపడితే నేల స్వభాన్ని బట్టి 12 ఏళ్ల నుండి 15 ఏళ్ల పాటు నాణ్యమైన మల్బరీ ఆకులు ఉత్పత్తి అవుతాయి. ఆ తర్వాత తోట దున్ని వేసి మళ్లీ నాటు కోవడం ఉత్తమం.

రైతులకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

'పట్టుబడి' కార్యక్రమం ద్వారా మల్బరీ తోటల సాగుపై అవగాహన కల్పించి తోటల పెంపకం, తర్వాత నిర్మించిన షెడ్లలో పట్టు పురుగుల పెంపకం యొక్క విధి విధానాలు, మార్కెట్ చేసుకునే విధానంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నరసరావుపేట, పిడుగురాళ్లలో సాంకేతిక కేంద్రాలు నడుపుతూ రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నాం.

మార్కెట్లో ఒడిదుడుకులు ఏమైనా ఉన్నాయా?

ఆవేమీ లేవు. ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రాలు పలమనేరు, మదనపల్లి, హిందూపురం, కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఈ- మార్కెటింగ్ పద్ధతి ద్వారా పట్టు గూళ్ల కొనుగోలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో ధర రూ.580 ఉంది. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా గణనీయంగా అదాయంగా లభిస్తుంది. పట్టు గుళ్ల విక్రయం అనంతరం వెంటనే నగదు చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది.

పరిశ్రమ స్థాపనకు ఎవర్ని సంప్రదించాలి?

పట్టుపర పరిశ్రమ స్థాపించి స్వయం ఉపాధి పొందాలనుకునేవారు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వినుకొండ రోడ్డులోని జిల్లా పరిశ్రమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు. లేదా పరిశ్రమ సాంకేతిక అధికారి శ్రీధర్ ఫోన్ నం:9441030263కు సంప్రదించవచ్చు.

ఈ ఏడాది లక్ష్యం ఎంత?

ఈ ఏడాది 100 ఎకరాలకు మల్బరీ సాగుకు 20 వరకు షెడ్ల నిర్మాణం లక్ష్యం. అయితే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 22 ఎకరాలు మల్బరీ సాగు చేయించాం. తక్కువ నీటి వనరులున్న రైతులు సైతం బిందు సేద్యం విధానం ద్వారా మల్బరీ సాగు చేసుకో వచ్చు. సమగ్ర యాజమాన్య పద్ధతులను జోడించి అందుబాటులో ఉన్న నూతన రకపు వంగడాలతో పంటలను సాగు చేసుకోవాలి. స్వల్పకాలిక పంటల తరహాలో 45 రోజుల నుంచి 70 రోజులు ఆదాయం లభిస్తుంది. తెగుళ్ల సోకే అవకాశాలు తక్కువ. వాణిజ్య పంటల తరహాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదు. రెండెకరాల్లో మల్బరీ సాగు చేపట్టి పట్టు పరిశ్రమ స్థాపిస్తే ఏడాదికి రూ.రెండు మూడు లక్షల నికర ఆదాయం పొందొచ్చు.

ఏయే నేలలు, ఏ సమయాలు మల్బరీ సాగుకు అనుకూలంగా ఉంటాయి?

చౌడు, ఇసుక పొర నేలలు మినహా అన్ని రకాల నేలలు మల్బరీ సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఎర్ర నేలల్లో మల్బరీ నాణ్యత బాగుంటుంది. మిరప తోటలకు మల్బరీ తోటలు దూరంగా ఉండడం శ్రేయస్కరం. మిరప సాగు చేసిన పొలంలో 3 నుండి నాలుగేళ్ల వరకు మల్బరీ సాగు చేపట్టకుండా ఉండడం శ్రేయస్కరం. జూన్ నుండి మార్చి వరకు మల్బరీ సాగు చేసుకోవచ్చు. మల్బరీ రెండు రకాలు ఉన్నాయి. సి.బి రకం, బైవోల్ట్ రకం. సి.బి రకం వేడి వాతావరణంలో సైతం సాగు చేసుకోవచ్చు. బై వోల్ట్ రకం అధిక వర్షాలనూ తట్టుకుంటుంది. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బై వోల్డ్... సిబి రకం మార్చి నుండి జూన్ వరకు సాగు చేసుకోవాలి.

సాగు పద్ధతులు రైతులకు అర్థమవుతాయా?

మల్బరీ సాగు విధానం, పట్టుపురుగుల పెంపకం రైతులకు సులభంగానే అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో 5 దశలు ఉంటాయి. గుడ్డు నుండి పురుగు బయటకు వచ్చేది మొదటి దశ. మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. 6 నుండి 8 రోజుల తర్వాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. 25వ రోజు మార్కెట్‌కు పోతుంది. ఈ- ఆక్షన్ ద్వారా ట్రైడర్స్‌కు విక్రయించాలి. ధర నచ్చుకుంటే రెండు, మూడు ఆప్షన్లకు వెళ్లొచ్చు. విక్రయం అనంతరం గంట తర్వాత రైతు ఖాతాలోకి డబ్బులు జమవుతాయి.

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా